# చదువు!

ఠంగ్... ఠంగ్... ఠంగ్...

మూడుసార్లు మోగింది గంట.

అంటే ఇంకా ఒక్క గంట.... మిగిలిందన్నమాట. అందులో ఆరగంట ఆబ్జెక్టివ్ టైప్‌కి పోతే అరగంటే...

'ఇంత టైం అయిపోయిందేమిటి?' ఆలోచిస్తూ కొశ్చిన్ పేపర్ చూశాడు సాయినాథ్.

'ఇంకా రెండు ప్రశ్నలకు జవాబులు రాయాల్సి వుంది. అంతేనా? నమ్మలేనట్టు పేపర్ వెనకవైపు తిప్పాడు.

గుండె ఆగినంత పనైంది!

మెయిన్ క్వశ్చన్స్ నాలుగు - తర్వాత రాద్దామనుకొని వదిలేశాడు. ఒక్క క్షణం మెదడు మొద్దుబారినట్లైంది. 'మిగిలిన ఈ రెండు జవాబులూ ముందు రాయాలా, ప్రధానమైన నాలుగూ ముందు రాయలా?' ఓ పట్టాన తేల్చుకోలేకపోయాడు. మరోపక్క సెకన్ల ములూ, నిముషాల ముల్లూ పోటాపోటీగా పరుగెత్తుతున్నాయి గడియారంలో.

ఏమైతే అయ్యిందని లఘు సమాధానాలే ముందురాశాడు. వేగంగా రాసినా 13 నిముషాలు పట్టింది. అంటే మిగిలిన 17 నిముషాల్లో నాలుగు జవాబులు కేవలం ముఖ్యాంశాలు రాసి, అన్నీ పూర్తిచేయాలి!

'ఏది ముందు రాయాలి?' మళ్ళీ సందేహం!



జవాబులన్నీ తెలిసినట్టే వున్నాయి కాని ఏదీ స్పష్టంగా గుర్తుకురావడంలేదు. ఠక్కున జవాబు రాయడం మొదలుపెట్టాడు. మరోమారు మనసును అదుపులోకి తెచ్చుకుంటూ కలం వేగాన్ని పెంచాడు. మొదటి జవాబు పూర్తి చేశాడు. రెండో జవాబు నాలుగో లైను వ్రాస్తున్నాడు....

'ఠంగ్... ఠంగ్.... ఠంగ్... ఠంగ్....'

ఆ గంట తన గుండెల్లోనే వేలాడదీసి కొడుతున్నటనిపించింది.

ఆ పైన వెంటవెంటనే ఆబ్జెక్టివ్ టైప్ పేపర్ రావడం, నెంబర్ వేసి, దాన్ని కట్టేసి నింపేయడం గబగబా కానిచ్చేశాడు. మళ్ళీ మెయిన్ ఆన్సర్ రాస్తుండగానే లాంగ్‌బెల్ మోగింది.

పట్టువదలకుండా గబగబా రాస్తూనే ఉన్నాడు సాయి.

చేతికిందున్న జవాబు పత్రాన్ని కరుగ్గా లాక్కున్నాడు నిరీక్షకుడు (ఇన్విజిలేటర్).

"సార్....! ప్లీజ్ సార్.... అయిదు నిముషాలు టైమివ్వండి. నాకన్ని జవాబులూ వచ్చుసార్.... 20 మార్కులు పోతాయి సార్.. ఇంకా రెండు జవాబులు..." దుఃఖంతో గొంతు పూడుకుపోయింది.

'చెబుతున్నది తనకు కాదు, గోడకు' అన్న చందాన ఆ నిరీక్షకుడు వెనక్కి చూడకుండా వెళ్ళిపోతున్నాడు.

"సార్... మీ కాళ్ళు..." గట్టిగా అతని కాళ్ళు చుట్టేసుకున్నాడు సాయి.

"ఠాప్....!" ఒంటిమీద గట్టిగా చరిచారెవ్వరో!

గబుక్కున కళ్ళు తెరిచాడు.

ఎదురుగా ఉగ్రనరసింహ రూపం ... నాన్న....

అంటే – 'ఇంతసేపూ తాను కలగంటున్నాడా?' ఆశ్చర్యపోతూ అది.... తమ ఇంట్లో, మంచమ్మీద.... అంటూ పరిసరాలను గుర్తించడంలో లీనమయ్యాడు.

"ఎంతసేపని లేపాలిరా దున్నపోతూ! రాత్రేమో మూడింటికి లేస్తా, రెండున్నరకే లేస్తా, చదువుకుంటా నంటూ కబుర్లు చెప్పి, తొమ్మిది దాటక ముందే ముసుగెట్టేస్తావు. ఇప్పుడు అయిదు గావస్తున్నా కదలవు. కుంభకర్ణుడన్నా నయం వాడు వాసన చూపిస్తే లేస్తాడట. హూ! మీకు ఎట్లా చెబితే అర్థమవుతుందిరా...?!" విసుక్కుంటూ అక్కడి నుంచి కదిలాడు సాయినాథ్ తండ్రి– కరుణాకర్.

తండ్రి మాటల్తో మిగిలిన నిద్ర కూడా పరిసరాల్లో లేకుండా పారిపోయింది.

'ఛ! ఎంత నిద్ర పట్టేసింది? మొద్దు నిద్ర...! సోమరి నిద్ర....! దరిద్రపు నిద్ర....! పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ టెన్షన్ పెరిగిపోతూన్నది. రాత్రిళ్ళు నిద్ర సరిగ్గా పట్టిచావడంలేదు. పుస్తకం ముందేసుకుంటే కళ్ళు మూతలు పడిపోతున్నాయి. పక్కమీదికి చేరితే నిద్ర తేలిపోతుంది. నిద్ర పట్టడమే తడవు కలలు..... అన్నీ ఇట్లాంటివే.... ఉదయం లేద్దామంటే మెలకువ రాదు. చదవాల్సింది చాలా ఉంది. సమయం చాలా తక్కువ.... 'ఆలోచిస్తూ కళ్ళు కడుక్కొని పుస్తకం తెరిచాడు సాయి.

అరగంట గడిచిందో లేదో.... పేపరువాడు, పాలవాడూ.... ఉదయం వంట కోసం తక్కువపడిన చిన్న చిన్న సామాన్ల కోసం అమ్మ అభ్యర్థనలు, చెల్లి అరుపులు, బడికి తయారీ హడావుడి... చూస్తుండగానే గడియారం ఏడున్నర చూయించింది. ఏదో ఇంత తిని బస్సెక్కాడు. వెళ్ళేముందు తల్లి అననే అంది షరామామూలుగా - "మీ నాన్న చెప్పినట్లు బాగా చదువుకోరా. ఆయనకు కోపం తెప్పించకు!" అని.

✠ ✠ ✠

"ఏరా! ఇప్పుడు టైమెంత?"

ఆలస్యంగా బడికొచ్చిన సాయినాథ్ బుర్రమీసాల మాష్టారు పరాంకుశాన్ని తప్పించుకోలేకపోయాడు.

సమాధానం చెప్పలేక తలదించుకున్నాడు సాయి.

పరాంకుశం దృష్టి సాయినాథ్ మూతిమీదకి మళ్ళింది. "ఏరా, సమాధానం చెప్పవు? హు! మీసాలొస్తున్నాయి గదా! దేశాలు కనిపిస్తాయా? అప్పుడే పెద్ద పోటుగాళ్ళమైపోయామనుకుంటున్నారు గదరా?"

కొందరంతే. అయితే అపార్థం! కాకపోతే పెడార్థం!! సాయినాథ్ మౌనం అతణ్ని మరింత రెచ్చగొట్టి ఏమేమో మాట్లాడేలా చేస్తున్నది.

మాష్టారట్లా మాట్లాడ్డం నచ్చలేదు సాయికి. కాని, మౌనం వినా మార్గం లేదు. తరగతి గదిలోకెళ్ళి లెక్కల టీచర్ వడ్డనలు కూడా భరించాల్సి ఉంది మరి. 'ఛ! ఈరోజు లేచిన వేళ బాగాలేదు. నాన్న స్తోత్రాల్తో మొదలైంది. ఇప్పటికే చాలా అయ్యాయి. ఇంకెన్ని భరించాలో....'

"ఎల్లెల్లు! చక్కగా చదువుకుంటే ఇవన్నీ ఉంటాయా?" అనుగ్రహమో, అసహనమో - పరాంకుశం కరుణించాడు చివరికి.

తరగతి గది గుమ్మంలోకెళ్ళి లెక్కల టీచరు శాంతకి కనిపించాడు సాయినాథ్.

ఆమె ఇతణ్ని చూడలేదు. కాదు, చూడనట్టు నటించింది. పీరియడంతా అయిపోయేదాకా పల్లెత్తి పలకరించలేదు. బెల్లు మోగింతర్వాత బయటికెళ్తూ, అప్పుడే చూసినట్లు కళ్ళు పెద్దవి చేసింది.

"ఓహో! సాయినాథ్ గారా! ఇప్పుడు దయచేశారేంటి?" అంటూ పొరబాటు మాట్లాడినట్లు నాలిక కరుచుకొని "సారీ! మీరు పదోతరగతి కదూ! పాఠశాల షెడ్యూల్‌తో సంబంధం లేని వాళ్ళేమో.....! మిమ్మల్నేమీ అనకూడదేమో కదూ....!" వ్యంగ్యం ఒలకబోసింది.

"సారీ టీచర్... ఇంట్లో...." సంజాయిషీగా ఏదో అనబోయాడు సాయి.

"అబ్బెబ్బే! నేనేమైనా అన్నానా? అడిగానా? చదువుకోని వాళ్ళకెలాగూ పట్టదు. కాస్తో కూస్తో చదివే మీలాంటి వాళ్ళు కూడా ఇట్లా తయారయ్యారేంటనే నా బాధ!" చివరి మాట నొక్కి పలుకుతూ అశాంతిగా అక్కడి నుండి వెళ్ళిపోయింది శాంత.

నిట్టూరుస్తూ క్లాసులో కడుగుపెట్టాడు సాయినాథ్.

"హాయ్ సాయీ! రాత్రేమేం చదివావ్?" లోపలికెళ్ళగానే అడిగాడు ప్రసాద్.

"హూ! ఏం చదవలేదురా!" నిట్టూరుస్తూ తన సీట్లో కూలబడ్డాడు సాయి.

"నాకు తెలుసులే... నువ్వు రాత్రంతా నిద్రపోకుండా చదివావని నీకళ్ళే చెబుతున్నాయి." సాయి మాటల్ని నమ్మలేదు ప్రసాద్. ఎప్పుడూ అతనితో పోటీపడ్తుంటాడు. ముందుండాలనుకుంటాడు.

ప్రసాద్‌ని జాలిగా చూడటం వినా మరేమీ అనలేకపోయాడు సాయి.

ఆ తర్వాత శ్రీనివాస్ నడిగి శాంత టీచర్ ఏమేం చెప్పిందో తెలుసుకోవడంలో మునిగిపోయాడు

ఉదయం ఒక గంట ప్రిపరేషన్. తర్వాత ఓ పరీక్ష. మధ్యాహ్నం మరుసటి రోజు పరీక్షకు సంబంధించిన రివిజన్, సాయంత్రం ట్యూషన్. మిత్రుడు శ్రీనివాస్ చెప్పిన విషయాలను విని, ఒక్కసారి నోట్స్ తిరగేద్దామనుకుంటూండగానే పరీక్షకోసం గంట మోగింది.

✠ ✠ ✠

సైన్స్ మాష్టారు పరాంకుశం 'కాంతి' అధ్యాయం నుండి పరమాణువుల్లోని ఎలక్ట్రాన్ల కదలికల్ని గురించి సుదీర్ఘంగా సాగదీస్తున్నాడు.

సాయి శ్రద్ధగా వినేందుకు ప్రయత్నిస్తున్నాడు కానీ పరాంకుశం సాగదీత ధోరణి అతడ్ని ఆకట్టుకోకపోగా విసుగెత్తేలా చేస్తున్నది. అతనికి తెలియకుండా కళ్ళు అరమోద్పులవుతున్నాయి.

"ఛెళ్!"

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు సాయి.

ఎదురుగా కోపంతో ఊగిపోతున్నాడు పరాంకుశం.

గబుక్కున లేచి నిలబడబోయి తూలిపడ్డాడు. క్లాసంతా గొల్లుమంది.

ఆ శబ్దానికి ప్రిన్సిపాల్ చంద్రలీల పరుగెత్తుకొచ్చింది అక్కడికి.

"ఏం జరిగింది?" కంగారునణచుకుంటూ అడిగింది. జరుగుతున్నదానికి నూరురెట్లు, జరగబోయేదాన్ని ఊహించి, వర్ణించి, సాగదీసి చెప్పాడు పరాంకుశం.

"అవునా? ఇలాగైతే ఎట్లా? మీమీద మేమెన్నో ఆశలు పెట్టుకున్నాం గదరా! ఈ లెక్కన చూస్తే ర్యాంకుల సంగతి సరే, అసలు పాసవుతారా లేదా అన్న అనుమాన మొస్తోంది..." ఆవేదనంతా వెళ్ళగక్కింది.

గత సంవత్సరం టౌన్లోని స్కూళ్ళలో, వాళ్ళ స్కూల్ విద్యార్థి అత్యధిక మార్కులు తెచ్చుకున్నాడు. స్టేట్ ర్యాంక్ కొంచెంలో తప్పిపోయింది. అయితేనేం ఆ మాత్రం ప్రభావానికే ఈ సంవత్సరం అడ్మిషన్లు బాగా పెరిగాయి. అది చంద్రలీల బృందంలో ఉత్సాహాన్ని, ఆశల్నీ ఇతోధికంగా పెంచింది. ఈసారి ర్యాంకుల సాధనతోపాటు వందశాతం ఫలితాల మీద దృష్టి పెట్టారు. కాని, పరిస్థితి చూస్తే అంతా తలక్రిందులైనట్లనిపించ సాగింది ఆమెకు. ఆవేదన ఆవేశంగా మారి, అది బి.పి కింద తర్జుమా అయిపోయి, అరగంట ఆగకుండా వాగించింది ఆమెను.

ఆ వర్షం వెలిసింతర్వాత పరిస్థితి సాధారణంగా మారడానికి చాలా సమయమే పట్టింది. విద్యార్థులు వ్యక్తిగత అధ్యయనంలోకి మారిపోయారు. మౌనంగా చదువుకుంటున్నారు. సాయంత్రం ఐదు దాటింది.....

నెమ్మదిగా కలకలం....

'మధుసూదన్‌సార్....' 'మధుసూదన్ సార్...' అనే గుసగుసలు చాపకింద నీరులా పిల్లలందర్నీ తడిపేసాయి. క్షణాల్లో అందరి దృష్టీ అటు తిరిగింది.

మధుసూదన్‌రావు రెండేళ్ళ క్రితం అదే పాఠశాలలో పనిచేశాడు. ప్రభుత్వోద్యోగం రావడంతో వెళ్ళాడు. విద్యార్థులకే గాదు, ఉపాధ్యాయులకు, ప్రిన్సిపాల్ చంద్రలీలకు కూడా అతనంటే అభిమానం. సుగంధభరితమైన పూలు అందరినీ ఆకర్షించడంలో వింతేముంది?

'సార్ మాతో మాట్లాడితే బాగుండు....' నని పిల్లలు అనుకుంటుండగానే ప్రిన్సిపాల్ స్వయంగా మధుసూదనరావుని వెంటబెట్టుకొని అక్కడికి వచ్చింది.

పిల్లల సంతోషానికి మేర లేదు. ప్రిన్సిపాల్‌ని చూసి, భావోద్వేగాల్ని అదుపులో పెట్టుకుంటూనే గట్టిగా విష్ చేశారు.

అంగరూ కులాసాగా కూర్చోగానే చదువుపట్ల విద్యార్థులు చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఏకరువు పెట్టింది చంద్రలీల.

"వీళ్ళతో నన్ను ఏకాంతంగా మాట్లాడనివ్వండి" చెప్పాడు మధుసూదన్.

తర్వాత పిల్లలందరినీ పేరుపేరునా పలకరించాడు. తన మాటలు వింటూనే, మరోపక్క పుస్తకాల మీద దృష్టినిల్పిన పిల్లల్ని గమనించాడు.

"దయచేసి కష్టమనుకోకుండా పుస్తకాలు మూసేయండి!" సున్నితంగా వాళ్ళని మందలించాడు.

"పాఠం చెప్పేటప్పుడు ఇతర విషయాల గురించి ఆలోచించడం ఎంత తప్పో, ఇతర విషయాలను చర్చించేటప్పుడు పాఠాలను పట్టుకొని వేళ్ళాడటం అంతే తప్పు. ఏ పని చేస్తున్నామో ఆ పనిమీద దృష్టి పెట్టడం విజయానికి మొదటి సోపానం."

పిల్లలంతా ఆసక్తిగా వినసాగారు.

"ఎవరికోసమో చదువుతున్నామనే ఆలోచన మానుకోండి. వాళ్ళట్లాగే చెబుతారు. ర్యాంకు రావాలి, పేపర్లో మీ పేరు చూడాలి అని వీళ్ళు రెచ్చగొడతారు. అందులో తప్పులేదు. కానీ మీ శక్తిమేర మీరు ప్రయత్నిస్తారు ప్రయత్నం వికటిస్తే, పేపర్లో మరోరకంగా చూడాల్సి వస్తుంది. అందుకే వత్తిడిలో చదవకండి! ఇంట్రెస్టు కొద్దీ, శక్తి కొద్దీ చదవండి!"

మధుసూదన్ మాటలు వాళ్ళకి కొత్తగా ఉన్నాయి. చిత్రంగా ఉన్నాయి.

"ఇప్పటికీ రోజులో కనీసం 15 నిముషాలు ఆడుకోండి."

ఉలిక్కిపడ్డారంతా. నమ్మలేనట్టు చూశారు.

"ఆడటమంటే శరీరాన్ని శ్రమపెట్టడం కాదు. తక్కువ శ్రమతో మనకు ఉల్లాసాన్నిచ్చే ఆట ఏదైనా కావచ్చు."

"అంతసేపూ ఎక్కడుందో, ఠక్కున అక్కడ ప్రత్యక్షమైంది ప్రిన్సిపాల్."

"మధుసూదన్! ప్లీజ్ గెటప్!" ఆమె మాటల్లో కాఠిన్యం స్పష్టమైంది.

" మేడం ... ఒక్క ఐదు నిమిషాలు..." రిక్వెస్టింగ్‌గా అన్నాడు మధుసూదన్.

"న్నో!" మరింత గట్టిగా అందామె.

"మీరేదో పిల్లలకు బుద్ధి చెబుతారని ఆశిస్తే, ఆటలాడుకొమ్మని దిక్కుమాలిన సలహాలిస్తారా? .. మీరేం చెప్పనవసరం లేదు. ప్లీజ్ ! వెళ్ళండి!"

"ఏం మనుషులండీ మీరు? ఇప్పటివరకూ మీ మీద ఎంత గౌరముండేది. ఇదేనా మీరు పరీక్ష రాయబోయే పిల్లలకిచ్చే సలహా...." కసి, కోపం, బాధ ముప్పిరిగొనగా చంద్రలీల ధుమధుమలాడ్తూ వెళ్ళి తన సీట్లో కూలబడింది.

ఆమెకెదురు సీట్లో రిలాక్సయ్యాడు మధుసూదనరావు.

"మీరు ఎమ్మే, బిఇడి పూర్తిచేశారు కదా! దాదాపు పది పబ్లిక్ పరీక్షలు రాసి ఉంటారు. నిజాయితీగా ఒక్క జవాబు చెప్పండి. ఏ పరీక్షకోసమైనా ఏకబిగిన ఎనిమిది గంటలు చదివారా?" అడిగాడు మధుసూదన్.

"ఎందుకు?" అన్నట్టు చూసింది చంద్రలీల.

"ఆరుగంటలు....? నాలుగ్గంటలు....? కనీసం రెండు గంటలు పూర్తి ఏకాగ్రతతో చదివారా?"

ఆమె ఆలోచించసాగింది.

సంబంధం

"పోనీ మీ స్టాఫ్‌లో ఎవరైనా అట్లా చదివి వుంటారా? ఖచ్చితంగా చదివి వుండరు. వివేకానంద, అంబేద్కర్ లాంటి కారణజన్ముల సంగతి సరే. వాళ్ళయినా ఇప్పుడు విద్యార్థులున్న పరిస్థితుల్లో ఉంటే చదివేవాళ్ళో లేదో?"

"ఏదైనా ఒక విషయంలో ఏకాగ్రత చూపాలంటే మొదట ఆ విషయం మీద ప్రేమాభిమానాలు కల్గాలి. అది కల్గిస్తున్నారా ఉపాధ్యాయులు? పోనీ ఆ ఏకాగ్రత కోసం నిరంతరం సాధన కావాలి. శాస్త్రబద్ధమై సాధన ఇస్తున్నారా? కనీసం వాళ్ళు ఏ విషయాన్ని ఎంత మేర అవగాహన చేసుకుంటున్నారో పరిశీలించారా? వాళ్ళను ఆకర్షించేలా అందంగా, నిత్యనూత్నంగా, ఆకర్షణీయంగా బోధించే ఉపాధ్యాయులు కనీసం నలుగురైనా ఉన్నారా మీ స్టాఫ్‌లో ? ఉండరు. మరి అర్థం పర్థం లేకుండా వాళ్ళను హింసిస్తూ, ఫలితాల నాకాంక్షించడం ఎంత వరకు సబబు?"

మధుసూధన్ అట్లా అడుగుతాడనుకోలేదు ఆమె. అతడ్నే చూస్తూండిపోయింది. మాటలు రానట్టు.

"వాళ్ళ శారీరక స్థితి, మానసిక స్థితి, మేధోశక్తిపట్ల తల్లిదండ్రులకు సరియైన అవగాహన లేకపోవచ్చు. కానీ సైకాలజీ, అడ్మినిస్ట్రేషన్లు, ఫిలాసఫీ చదువుకున్నారు కదా! వీటినెప్పుడైనా పిల్లలకు అన్వయించి చూశారా? కనీసం పిల్లల ఇండ్లలో వాతావరణం గురించి తెలుసుకున్నారా?

చదువు- చదువు - చదువు అంటూ రోజుకు లక్ష సార్లు అనడం కంటే వాళ్ళకు ఆసక్తి కలిగేలా, శ్రమను మరపించేలా కొత్తదనం ఆ చదువుకోవడంలో పెంచండి.

అర్థం కాని విషయాలను తెలివైన పిల్లలతో చర్చించుకునే వీలు కల్పించండి. కనీసం గంటకొకసారి వాళ్ళకిష్టమైన సంగీతమో, జోక్సో, వినిపించి, వాతావరణాన్ని తేలికపర్చండి.

పరీక్షలకుముందు - అంటే ఇప్పుడు మరీ కష్టంగా అనిపించే అంశాల జోలికి వెళ్ళొద్దని చెప్పండి.

ప్రతి సబ్జెక్టూ తెలుసుకోవలసిందేనని, ఆ అవసరాన్ని బోధించేటప్పుడే తెలియజేసి, చదువు కేవలం పరీక్ష కోసం కాదు, జీవితం కోసం అనే భావన పెంచండి. ఎంతసేపూ

పరీక్షలు - పేపర్లు - మార్కులు - శిక్షలు అనే యాంత్రికతలో పడి 'చదువు చెప్పడం' అంటే డబ్బులు సంపాదించడం; 'చదువుకోవడం' అంటే మార్కులు సంపాదించడం అనే అర్థ విపరిణామాలు దాపురించాయి.

ముఖ్యంగా వాళ్ళు విద్యార్థులు, మేము ఉపాధ్యాయులం ఇనే ఇగో నుండి బయటపడి, వాళ్ళు మా బిడ్డలు అనే ఆత్మీయ భావం పెంచుకోండి. అప్పుడే చదువులు భారంగా ఉండవు. పిల్లలు నిజంగా జీవించడం నేర్చుకుంటారు."

ఆమె తేరుకోకుండానే అక్కడి నుండి ఒకింత ఆవేదనతో కదిలాడు మధుసూదనరావు.

❀❀❀

(ఆంధ్రభూమి శనివారం మార్చి 10, 2007)